ختم نبوت

4

# దైవదౌత్య పరిసమాప్తి


మూలం :

ముహమ్మద్ ఇర్ఫాన్ ఉమరీ

(అధ్యాపకులు; మర్కజ్ దారుల్‌బిర్)


అనువాదం

హనీఫా అహ్మదియా


ప్రకాశకులు :

మర్కజ్ దారుల్‌బిర్

అహ్మద్ నగర్, పెడన, ఆంధ్రప్రదేశ్, ఇండియా

ఫోన్ : 08672 200003, 9912193013.

అనంత కరుణామయుడు అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభం

# దైవదౌత్య పరిసమాప్తి

## అంతిమ దైవ దౌత్యాన్ని విశ్వసించటం

ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)ను అంతిమ దైవప్రవక్తగా విశ్వసించడం ఇస్లాం మూల విశ్వాసాలలో ఒకటి. దీనిపైనే ఒక విశ్వాసి విశ్వాసం ఆధారపడి ఉంటుంది. ఏ వ్యక్తయితే దైవ ప్రవక్త (స)ను విశ్వసించడో అతను విశ్వాస పరిధుల నుండి దూరమై అవిశ్వాసుల్లో చేరుతాడు. అలాగే దైవ ప్రవక్త కాని వ్యక్తిని దైవ ప్రవక్తగా భావించి విశ్వసిస్తే అలాంటి వ్యక్తి కూడా అవిశ్వాసి అవుతాడు. ఇస్లాం ధర్మంలోని కీలకమైన, సూక్ష్మమైన సిద్ధాంతాలను పవిత్ర ఖుర్ఆన్‌లో అల్లాహ్ క్లుప్తంగా తెలియజేశాడు. వాటిని మహా ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) హదీసులో విశదీకరించారు.

## మరో ప్రవక్త వచ్చే ప్రసక్తే లేదు

'దైవ ప్రవక్తల పరంపర'పై విశ్వాసమనేది ఎంతో అమూల్యమైన విషయం. దీనిపై పూర్తి ముస్లిం సమాజం (ఉమ్మత్) మధ్య ఏకాభిప్రాయం ఉంది. అందుకే ఏ వ్యక్తయినాసరే ప్రవక్త ముహమ్మద్ (స)ను అంతిమ, చిట్టచివరి ప్రవక్త అని విశ్వసించిన తరువాతే అతని విశ్వాసం పరిపూర్ణమవుతుంది. ఒక వేళ ఎవరైనా ప్రవక్త (స) ను చిట్టచివరి సందేశహరునిగా అంగీకరించకపోతే ఆ వ్యక్తి ఇస్లాం ధర్మం నుండి బహిష్కరించబడతాడు. ఎందుకంటే అల్లాహ్ పవిత్ర ఖుర్ఆన్‌లో తేటతెల్లంగా ఇలా తెలిపాడు:

**"ప్రజలారా! ముహమ్మద్(స) మీ పురుషుల్లో ఎవరికీ తండ్రి కాదు. అయితే ఆయన అల్లాహ్ సందేశహరుడు, ప్రవక్తల పరం పరను పరిసమాప్తం చేసే (చివరి) వాడు". (అల్ అహ్‌జాబ్-40)**

పై ఆయత్‌లో ముహమ్మద్ (స) ను ప్రవక్తల పరంపరను సమాప్తం చేసేవారిగా చెప్పటం జరిగింది. దాని కొరకు ప్రత్యేకంగా "ఖాతమున్" అనే పదాన్ని ఉపయోగించడం జరిగింది. "ఖాతమ్" అంటే 'సీలు' అని అర్థం. ఒక పనిని పూర్తి చేసిన తరువాత చివరగా 'సీలు' (ముద్ర) వేయడం జరుగు తుంది. అంటే ఆ పని చివరి వరకూ పూర్తయినట్లే. ఉదాహరణకు పవిత్ర ఖుర్ఆన్‌ను ప్రారంభం నుండి చివరి వరకు

చదవడాన్ని "ఖత్‌ముల్-ఖుర్‌ఆన్" (ఖుర్‌ఆన్ పూర్తి చేయటం) అంటారు.

*(లిసానుల్ అరబ్, ఖామూస్)*

పై వాక్యాల ద్వారా ప్రవక్తల పరంపర సమాప్తమైందని తెలుస్తుంది. అంతేకాకుండా దీనిపై వాదోపవాదాలు, ఘర్షణలు కూడా అనర్థమని తెలుస్తోంది. ఎందుకంటే పవిత్ర ఖుర్‌ఆన్, హదీసుల్లో ప్రస్తావన వచ్చిన తరువాత వాటిని విస్మరించి మరో మార్గాన్ని అనుసరించడం అజ్ఞానం, మార్గ భ్రష్టత్వం అవుతుంది.

ప్రవక్తల పరంపర పరిసమాప్తికి సంబంధించిన కొన్ని హదీసులను పరిశీలిద్దాం :

1. దేవుని అంతిమ ప్రవక్త (స) ఈ విధంగా తెలిపారు:

**"బనీ ఇస్రాయీల్‌కు ప్రవక్తలు నాయకత్వం వహించారు. ఒక ప్రవక్త మరణిస్తే ఆ తర్వాత మరో ప్రవక్త ప్రాతినిధ్యం వహించేవారు. అయితే నా తరువాత ప్రవక్తలుండరు, ఖలీఫాలు మాత్రం ఉంటారు."**

*(బుఖారి: కితాబుల్ మనాఖిబ్)*

2. దేవుని అంతిమ ప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు : **"నాకు ఆరు విషయాలలో మునుపటి ప్రవక్తలపై ఆధిక్యత ఇవ్వబడింది.**

**1.** **నాకు సమగ్రమైన విషయాన్ని సంక్షిప్తంగా చెప్పే నేర్పు వొసగబడింది.**

**2.** **గాంభీర్యం ద్వారా నాకు సహాయం అందజేయబడింది.**

**3.** **యుద్ధ ప్రాప్తి నా కొరకు ధర్మసమ్మతం చేయబడింది.**

**4.** **నా కొరకు సమస్త భూమి సజ్దా చేసే స్థలంగా మరియు పవిత్రంగా చేయబడింది.**

**5.** **నన్ను సమస్త జాతుల వైపునకు ప్రవక్తగా చేసి పంపటం జరిగింది.**

**6.** **నాతో దైవదౌత్యం పరిసమాప్తం చేయబడింది.**

(సహీహ్ ముస్లిం, తిర్మిజి, ఇబ్నుమాజా)

3. దేవుని అంతిమ ప్రవక్త (స) ఇంకా ఇలా సెలవిచ్చారు:

**"నేను ముహమ్మద్‌ని, అహ్మద్, మాహీని, నా ద్వారా (కుఫ్ర్) తుడిచిపెట్ట బడుతుంది. నేను 'హాషిర్'ని. నా తరువాత ప్రజలు 'హష్ర్' మైదానంలో సమీకరించబడతారు. మరియు నేను 'అఖిబ్' (సమాప్తుడను). నా తరువాత ఏ ప్రవక్తా రారు".** *(సహీహ్ బుఖారి, కితాబుల్ ఫజాయిల్)*

4. ప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: "నేను ప్రవక్తల్లో చిట్టచివరి వాడను, నా మస్జిదు చిట్టచివరి మస్జిదు". (ముస్లిం, కితాబుల్-హజ్జ్)

## ఒక ఉపమానం

5. దేవుని అంతిమ ప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: "మునుపటి ప్రవక్తల మరియు నా ఉదాహరణ ఎలాంటి దంటే ఒక వ్యక్తి తన భవనాన్ని ఎంతో సుందరంగా నిర్మించాడు, కానీ.. ఒక మూల ఒక ఇటుక స్థలాన్ని ఖాళీగా వదిలేసాడు. ప్రజలందరూ ఆ భవనాన్ని సందర్శించి సంతోషించేవారు. కాని ఆ ఖాళీ స్థలాన్ని చూసి ఆశ్చర్యపడేవారు. ఇంతకీ ఆ స్థలంలో ఉండవలసిన ఇటుకను నేను. ఆ భవనం మునుపటి ప్రవక్తలు. నేను ప్రవక్తల పరంపరను సమాస్తం చేసేవాడిని".

*(సహీహ్ బుఖారీ: కితాబుల్-మనాఖిబ్)*

6. దేవుని అంతిమ ప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: "అల్లాహ్ ఏ ప్రవక్తనూ దజ్జాల్ ఉపద్రవం గురించి ప్రస్తావించకుండా, భయపెట్టకుండా పంప లేదు. (కానీ వారి కాలంలో 'దజ్జాల్' రాలేదు) ఇప్పుడు నేను చిట్టచివరి ప్రవక్తను, మీరు చివరి సమాజం వారు. ఖచ్చితంగా వాడు మీ జాతి లోనే రావలసి ఉంటుంది". *(ఇబ్న్‌మాజా, కితాబుల్ ఫితన్)*

హదీసు గ్రంథాలలో ఈ అంశానికి సంబంధించి అనేక హదీసులు ఉన్నాయి. పై హదీసులను శ్రద్ధగా పరిశీలిస్తే తెలిసేదేమిటంటే అల్లాహ్ సందేశహరుడైన ముహమ్మద్ (స) తన జాతి వారికి తన తరువాత వచ్చే ప్రళయ సూచనల గురించి, వాటి పరిష్కారం గురించి క్లుప్తంగా ఉదాహరణ లతో సహా తెలిపారు. ఇవన్ని తెలిసి కూడా విశ్వసించని వారు మార్గవిహీనులు.

## ప్రవక్త ప్రియ సహచరుల (రజి) ఏకాభిప్రాయం

పవిత్ర ఖుర్ఆన్, సున్నత్‌ల తరువాత ముఖ్యమైన స్థానం ప్రవక్త ప్రియ సహచరుల అభిమతం. మహా ప్రవక్త (స) మరణానంతరం కొంత మంది బూటకపు దైవప్రవక్తలు పుట్టుకు వచ్చారు. వాళ్లు తమని తాము దైవప్రవక్తలుగా ప్రకటించుకున్నారు. అలాంటి వారిలో 'ముసైలమా కజ్జాబ్', 'అస్వద్ అనసి', సజాహ ముఖ్యులు. కొందరు వారి మాటలను విశ్వసించారు. అలాంటి వారితో మొదటి మార్గదర్శక ఖలీఫా అబూ-బక్ర్ (ర) యుద్ధం చేశారు.

ఒక వేళ ఈ యుద్ధం మోస పూరితమైతే వారి స్త్రీలను సంతానాన్ని బానిసలుగా చేసేవారు కాదు.

## ధార్మిక పండితుల అభిమతం

పవిత్ర ఖుర్‌ఆన్, సున్నత్‌ల తరువాత, 'సహాబా' విధానం తరువాత నాల్గవ స్థానంలో ధార్మిక పండితుల మాట వస్తుంది. ఇస్లామీయ ధార్మిక పండితులందరూ ప్రవక్త (స) తరువాత మరే ప్రవక్తా వచ్చే ప్రసక్తి లేదని తేల్చి చెప్పారు. ఉదా: ప్రముఖ ధార్మిక పండితులు అల్లామాహ్ 'ఇబ్నె జరీర్' తిబ్రీ (రహ్మాలై) ఇలా తెలిపారు:

"ప్రవక్తల పరంపరను పరిసమాప్తం చేసిన తరువాత దానిపై సీలు వేయ బడింది. ఆ తలుపులు ప్రళయదినం వరకు ఎవరి కొరకూ తెరుచుకొనబడవు". (తఫ్‌సీర్ ఇబ్‌నె కసీర్)

ప్రముఖ ధర్మవేత్త, పవిత్ర ఖుర్‌ఆన్ వ్యాఖ్యాత 'ఇబ్నె కసీర్' (రహ్మాలై) ఇలా తెలుపుతున్నారు :

"ప్రవక్త ముహమ్మద్ (స) తరువాత మరే ప్రవక్త గానీ సందేశహరులు గానీ రారు". (తఫ్సీర్ ఇబ్నె-కసీర్)

అల్లామాహ్ 'షహరిస్తానీ' ఇలా తెలుపుతున్నారు: "ప్రవక్త ముహమ్మద్ (స) తరువాత మరో ప్రవక్త వస్తారని ఎవరైనా అంటే ఇక ఆ వ్యక్తి అవిశ్వాసి అవడంలో ఏ ఇద్దరి మధ్యా అభిప్రాయబేధం ఉండదు."

## మరో ప్రవక్త అవసరం ఉందా?

పవిత్ర ఖుర్‌ఆన్ ను శ్రద్ధగా అధ్యయనం చేయటం వల్ల తెలిసే విషయం ఏమిటంటే....

దైవ ప్రవక్తలు నాలుగు కారణాల దృష్ట్యా పంపబడ్డారు.

1. ఏ ప్రదేశంలోనైనా ప్రవక్త పంపబడక పోవడం వల్ల లేదా ప్రవక్త సందేశం వారికి అందకపోవడం వల్ల
2. మునుపటి ప్రవక్తల సందేశాన్ని మరచి పోయినా లేదా ఆయన బోధనలను మార్చేసినా..
3. పూర్వపు ప్రవక్త ద్వారా ప్రజలకు మార్గదర్శకత్వం అంది ఉండకపోవటం చేత, దైవధర్మ పరిపూర్ణత నిమిత్తం మరి కొంతమంది ప్రవక్తల అవసరం ఉండటం చేత
4. ఒక ప్రవక్త సహాయం కొరకు మరో ప్రవక్త రావలసి ఉండటం చేత....

పై కారణాల వల్ల ప్రవక్తలను పంపడం జరుగుతుంది. కానీ ప్రవక్త ముహమ్మద్ (స) తరువాత పై కారణాలు ఏవీ మిగలలేదు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సందేశం సర్వమానవాళి కొరకు అని పవిత్ర ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ సెలవిస్తున్నాడు :

" ఓ ముహమ్మద్! మేము నిన్ను సమస్త లోకవాసుల కోసం కారుణ్యంగా పంపాము". *(అల్-అంబియా :107)*

మహా ప్రవక్త ముహమ్మద్ (స) సందేశం సంపూర్ణ సందేశం అని పవిత్ర ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ సెలవిస్తున్నాడు :

"ఈ రోజు మీ కొరకు మీ ధర్మాన్ని పరిపూర్ణం గావించాను. మీపై నా అనుగ్రహాన్ని పూర్తి చేశాను. ఇంకా ఇస్లాంను మీ ధర్మంగా సమ్మతించి ఆమోదించాను". (అల్ మాయిద:3)

ముహమ్మద్ (స) వారి షరీయత్ ఈ ప్రపంచం అంతమయ్యే వరకు ఉంటుంది. దీనిలో ఎవరూ ఎలాంటి మార్పులు చేర్పులు చేయలేరు. ఎందుకంటే దీని సంరక్షణ బాధ్యత స్వయంగా అల్లాహ్‌యే తీసుకున్నాడు. పవిత్ర ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

"మేమే ఈ ఖుర్‌ఆన్‌ను అవతరింపజేశాము, మరియు మేమే దీనిని రక్షిస్తాము". *(అల్ హిజ్ర్ :09)*

అయితే ఇక్కడ మనకు ఒక సందేహం కలగవచ్చు. ప్రవక్తల పరంపర పూర్తయిన తరువాత ప్రళయం వరకు ధర్మసంస్థాపన ఎవరు చేస్తారు? ప్రజలకు దైవ మార్గం, సందేశం ఎవరు చేరవేస్తారు?

ప్రవక్తల పరంపర పూర్తయిన తరువాత ఈ కీలక బాధ్యత ధార్మిక పండితులపై ఉంటుంది. ఎందుకంటే వారే ప్రవక్తలకు వారసులు. అంతిమ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు :

"ధార్మిక పండితులు ప్రవక్తలకు వారసులు. వారు దీనారులు, దిర్హములు (ఆస్తి పాస్తుల)ను వారసత్వంగా వదలి వెళ్ళరు. వారు తమ విద్య (జ్ఞానాన్ని) వదలి వెళతారు. వారు ధర్మజ్ఞానానికి వారసులు."

అందుకే ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అంతిమ హజ్ యాత్రలో ఇలా ఉపదేశించారు :

"మీలో ఎవరైతే ఇక్కడ ఉన్నారో వారు ఇక్కడలేని వారికి (హాజరు కాని వారికి) నా సందేశాన్ని చేరవేయండి".

నేడు సమాచారాన్ని చేరవేయటానికి అనేక ఆధునిక మార్గాలు, ప్రచార, ప్రసార సాధనాలు అందుబాటులో ఉన్నాయి. వాటి ద్వారా సమాచారాన్ని ఎంతో సులభంగా, అతి వేగంగా ప్రపంచ నలుమూలలా చేర్చగలుగు తున్నాము.

అంతిమ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తరువాత మరో ప్రవక్త లేక ప్రవక్తల అవసరముండి ఉంటే అల్లాహ్ ముందే దాని గురించి ప్రవక్త (స) కు తెలిపి, తద్వారా ఆయన (స) సమాజానికి తెలియపరచేవాడు. మునుపటి ప్రవక్తలు మూసా(అ), ఈసా (అ) మహా ప్రవక్త (స) రాక గురించి ముందస్తు సూచికలు ఇచ్చినట్టుగా ప్రవక్త (స) కూడా రాబోయే ప్రవక్త గురించి తన సమాజానికి అవగాహన కల్పించి ఉండేవారు. ఎందుకంటే ఆయన (స) సమాజం రాబోయే కొత్త ప్రవక్త గురించి అవగాహన లేక ఆతనిని తిరిస్కరించి తన సమాజం నరకాగ్నికి ఆహుతి కాకూడదని తప్పక తెలిపేవారు.

అంతిమ ప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు : " ఒకవేళ నా సమాజంలో ప్రవక్త మూసా (అ) వచ్చి వుంటే ఆయన కూడా నన్ను విశ్వసించి అనుసరించడం తప్ప మార్గాంతరం ఉండేది కాదు. ప్రవక్త ఈసా (అ) కూడా ప్రళయానికి ముందు ప్రవక్త (స) అనుసరణీయుడిగా ఆయన (స) సమాజానికి చెందిన వాడిగా వస్తారు తప్ప మరో ప్రవక్తగా రారు".

## నేటి సమాజంలో మరో ప్రవక్త రాక భాగ్యమా? అభాగ్యమా?

నేటి యుగంలో మరో ప్రవక్త రావడం ప్రజలకు అదృష్టం కాదు, దురదృష్టమే అవుతుంది. ఎందుకంటే ఒక జాతి సరైన మార్గంలో నడవాలంటే వారు ఆచరించ దగ్గ విషయాలు ఒక్కటై ఉండాలి.

- వారి ఆరాధ్యదైవం ఒక్కడే అయి ఉండాలి
- వారి సందేశహరుడు ఒక్కడే అయి ఉండాలి
- వారి ధర్మ గ్రంథం ఒక్కటే అయి ఉండాలి
- వారి ధర్మం కూడా ఒక్కటే అయి ఉండాలి

ఒక వేళ ఒక్కొక్క ప్రాంతానికి ఒకొక్క సందేశహరుడైతే ప్రతి సందేశహరుడితో పాటు ఒక్కొక్క వర్గం ఉంటుంది. దీని వల్ల ఉన్నత

సమాజం ముక్కలై వర్గపోరు మొదలవుతుంది. అరాచకం, కల్లోలం సృష్టించబడతాయి. దీని వల్ల సన్మార్గం కాకుండా అపమార్గానికి ప్రజలు అలవాటు పడతారు.

పై విషయాలను పూర్తి సాక్ష్యాధారాలతో పరిశీలించిన తరువాత ఎవరైనా ప్రవక్తగా, ప్రకటించుకుంటే అతన్ని ప్రవక్తగా నమ్మవలసి ఉంటుందా..? ఒకసారి ఆలోచించండి..!

అలా ప్రకటించుకున్న వాడు సంత్యవంతుడా? అసత్యుడా..? నిస్సందేహంగా అతను అసత్యవాదే. వంచకుడే. అంతేకాకుండా మన మౌలిక విశ్వాసా లకు సంబంధించిన 'అంతిమ దైవ దౌత్యం'పై అఘాయిత్యానికి పాల్పడిన వ్యక్తిగా, అల్లాహ్ ఆదేశాలు నిరాకరించిన వ్యక్తిగా తన పరలోక జీవితాన్ని చేతులారా నాశనం చేసుకున్న 'మహా దౌర్జన్యపరుడి'గా మిగిలిపోతాడు. అలాంటి వారికి ఇస్లాం ధర్మంలో స్థానం లేదు. వారు ముస్లిములు కారు. అలాంటి అసత్య ప్రవక్తలను విశ్వసించేవారు, ఆదరించేవారు కూడా అవిశ్వాసులే.

అల్లాహ్! ఇలాంటి వారికి సన్మార్గాన్ని అధ్యయనం చేసి దానిని ఆచరించే అనుగ్రహాన్ని ప్రసాదించు.. ఆమీన్.

అల్లాహ్ మనల్ని ఋజుమార్గం పొందిన తరువాత మార్గ భ్రష్టత్వం నుండి కాపాడు గాక! ఆమీన్!

మరిన్ని వివరాలకు సంప్రదించండి

MARKAZ DARULBIR

Ahmed Nagar, PEDANA - 521366

Krishna Dist. A.P. Ph : 08672 200003, 9912193013